

పుస్తక పఠనంతో విజ్ఞానం

పుస్తక పఠనంతో జ్ఞాన సంపద పెరుగుతుందని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. 8లో



పలు ప్రత్యేక రైళ్లు

ప్రయాణికుల సౌకర్యార్థం దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. 8లో



శ్రీరాములు, రావుల సత్తా

మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌లో శతాధిక వృద్ధుడైన శ్రీరాములు, మరో వెటరన్ కె.వి.రావు స్వర్ణాలందుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం



రైల్వే స్టేషన్ నుంచి బయటకు వస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఏయూక్యాంపస్ : అరకు మండలంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆత్మీయ స్వాగతం లభించింది. రైలులో విశాఖకు వచ్చిన గవర్నర్‌కు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోర్టు గెస్టు హౌస్ చేరుకున్న గవర్నర్‌ను కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోర్టు గెస్టు హౌస్ నుంచి రోడ్డు మార్గంలో అరకు మండలం పద్మపురం పంచాయతీ పరిధిలోని యండపల్లివలస రైల్వే గెస్టు హౌస్‌కు వెళ్తారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వైద్య ఆవిష్కరణలకు వేదికగా విశాఖ



ప్రసంగిస్తున్న సీఈవో జితేంద్ర శర్మ

ఏయూ క్యాంపస్: వైద్య ఆవిష్కరణలకు వేదికగా విశాఖ నగరం నిలుస్తుందని మెడ్‌టెక్ జోన్ ఎండీ అండ్ సీఈవో జితేంద్ర శర్మ అన్నారు. మంగళవారం మెడ్‌టెక్ జోన్‌లో వరల్డ్ హెల్త్ ఇన్నోవేషన్ ఫోరం, కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించే సదస్సును ఆయన ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ సదస్సులో వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

27న పుణ్యనదీ హారతి



వరాహ పుష్కరిణి

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 27న శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి నిర్వహించనున్నట్లు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం అనుబంధ దేవాలయమైన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులను ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు తిరువీధిగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్తామన్నారు. అక్కడ గట్టుపై ఉత్సవమూర్తులను వేంజేపచేసి సాయంత్రం 5.30 గంటల నుంచి పుణ్యనదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నక్షత్ర హారతి, కుంభ హారతి, ఆయుత దీపార్చనలు ఉంటాయన్నారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణి గట్టుపై దీపాలు వెలిగిస్తారన్నారు. ప్రమిదలు, వత్తులు, నూనె దేవస్థానమే ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

16న జెడ్పీ వైస్ చైర్మన్ ఎన్నిక

మహారాణిపేట: ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఈ నెల 16న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ మందిరంలో సమావేశం జరుగుతుంది. సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు సెప్టెంబర్ 10న అనారోగ్య కారణాలతో మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీ అయిన ఆ పదవి కోసం ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. 16న ఎన్నిక జరగకపోతే 17న సెలవు అయినప్పటికీ తప్పకుండా ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఎన్నిక నిర్వహిస్తారు.

కాశీ రైలుపై కదలిక

సాక్షి ఎఫెక్ట్..

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నుంచి కాశీకి డైరెక్ట్ రైలును త్వరలో పునఃప్రారంభించేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కోరిక మేరకు గతంలో కాశీకి డైరెక్టర్ రైలు నడిపారు. కొన్నాళ్ల తర్వాత ఆపేశారు. దీనిపై ఈ నెల 10న కాశీ రైళ్ల కథ కంచికేనా? అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన అధికారులు త్వరలో కాశీ రైలును పట్టాలెక్కించే ఏర్పాట్లు చేస్తున్నారు. రైల్వే మంత్రి సెప్టెంబర్ 25న ప్రకటించిన విధంగా సంబల్‌పూర్–బనారస్–సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 21 లేదా 22వ తేదీ నుంచి విశాఖపట్నం వరకు పొడిగించవచ్చని తెలిసింది. తేదీలను రైల్వే అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

బాలా.. భళా



జిల్లాలోని పలు పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. చిన్నారులు కేక్ కట్ చేసి, ఫ్యాన్సీ డ్రెస్‌లు ధరించి సందడి చేశారు.

కెవ్వు కేకు



హోటల్ దసపల్లాలో మంగళవారం క్రిస్మస్ కేక్ మిక్సింగ్ అట్టహాసంగా జరిగింది. మహిళలు, చిన్నారులతో హోటల్ నిర్వాహకులు కేక్ మిక్సింగ్ చేయించారు.

కార్తీకం.. ఆరంభం



కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆర్.కె.నగర్‌లో కొలువైన రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహిళలు దీపాలు వెలిగించారు.

ఏయూ.. సరికొత్త చరిత్ర

- నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ కైవసం
- వర్సిటీ చరిత్రలో తొలిసారిగా 3.74 సీజీపీఏ
- వివరాలు వెల్లడించిన వీసీ ప్రసాదరెడ్డి



అధికారులతో సంతోషాన్ని పంచుకుంటున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్ : శతాబ్ది వేడుకలకు చేరువవుతున్న ఆంధ్ర విశ్వవిద్యాలయం మరో సమున్నత శిఖరాన్ని అధిరోహించింది. జాతీయ స్థాయిలో ఏయూ నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించింది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్(ఎన్ఏఏసీ)కు చెందిన సభ్యులు ఏయూను సందర్శించి నాక్ ఏ ప్లస్, ప్లస్ గ్రేడ్ (3.74 సీజీపీఏ) అందించారు. ఈ మేరకు మంగళవారం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి విలేకరులకు వివరాలు వెల్లడించారు. 98 సంవత్సరాల ఏయూ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే రోజుగా ఇది నిలుస్తుందన్నారు. దేశంలో ఇప్పటి వరకు మూడు వర్సిటీలు మాత్రమే 3.70కు పైగా స్కోర్ కలిగి ఉన్నాయని, వీటిలో 3.74 స్కోర్‌తో ఏయూ ప్రత్యేకత చాటుకుందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఓవరాల్ విభాగంలో మొదటి 100 స్థానాల్లో నిలిచి నాక్‌లో 3.74 స్కోర్ కలిగిన ఏకైక వర్సిటీగా ఏయూ నిలిచిందన్నారు. నాక్ గుర్తింపు వచ్చే ఏడేళ్ల పాటు అంటే 2030 వరకు అమలులో ఉంటుందన్నారు.

విదేశాల్లో క్యాంపస్ స్థాపనకు అవకాశం

నాక్‌లో అత్యుత్తమ స్కోర్ సాధించిన ఏయూ.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్ హోదాకు దరఖాస్తు చేసే అవకాశం సాధించిందని వీసీ తెలిపారు. ఈ గుర్తింపు వల్ల ఏయూ విదేశాల్లో కూడా క్యాంపస్‌ను ప్రారంభించే అవకాశం లభిస్తుందన్నారు. రీసెర్చ్ నిధుల జారీకి ఈ ర్యాంకింగ్ ఎంతో దోహదపడుతుందన్నారు. రాష్ట్రానికే ఏయూ గర్వకారణంగా నిలిచి సీజీపీఏ ఐఐఎస్ఈ బెంగళూరును దాటేసిందన్నారు.

ఏడు అంశాలపై అధ్యయనం

నాక్ కమిటీ ఏయూలో సందర్శించిన సమయంలో ఏడు అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించిందని వీసీ వివరించారు. కరికులం, టీచింగ్–లెర్నింగ్, రీసెర్చ్, స్టూడెంట్ సపోర్ట్–స్టూడెంట్ ప్రోగ్రామ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గవర్నెన్స్–లీడర్‌షిప్, ఇన్‌స్టిట్యూషన్ బెస్ట్ ప్రాక్టీసెస్ అనే అంశాలను పరిశీలించిందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు బోధిస్తున్న గ్రీన్ కెమిస్ట్రీని నాక్ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు. నాడు–నేడు పథకం స్ఫూర్తితో ఏయూలో చారిత్రక, పురాతన భవనాలను పరిరక్షించడం, మౌలిక వసతులను అభివృద్ధి చేసిన విధానాన్ని పరిశీలించి గ్రేడింగ్ ఇచ్చారన్నారు. ఇన్‌స్టిట్యూషనల్ బెస్ట్ ప్రాక్టీసెస్ విభాగంలో ఏయూలో ఆ హబ్, విద్యార్థులు ఓవరాల్ డెవలప్‌మెంట్‌కి ఉపయుక్తంగా యోగా–క్రీడలు–సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్లను పరిశీలించి అత్యుత్తమ మార్కులు వేశారన్నారు.

సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019లో తొలిసారిగా ఏయూకు వచ్చిన సందర్భంలో వేదికపై చెయిర్ ప్రొఫెసర్ల ప్రాముఖ్యతను వివరించారన్నారు. దానిని ఏయూలో నేడు అమలు చేస్తున్నామన్నారు. ఐవోసీఎల్, ఆర్ఐఎస్ఎల్, జీఎంఆర్‌తో పాటు రెండు విదేశీ బహుళజాతి సంస్థలు కూడా చెయిర్ ప్రొఫెసర్లను నియమించాయన్నారు. ఏయూని పరిశ్రమలతో అనుసంధానం చేయడం, 16 చెయిర్ ప్రొఫెసర్లను కలిగి ఉండటాన్ని నాక్ అభినందించిందన్నారు. ముఖ్యమంత్రి ఆలోచనను ఆచరణలో పెట్టడం, దీనికి నాక్ ప్రశంసలు లభించడంపై వీసీ సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఖేలో ఇండియాలో రూ.37.5 కోట్ల నిధులతో క్రీడా వసతుల కల్పనకు ఇటీవల ఆమోదం తెలుపుతూ తమకు ఉత్తర్వులు అందాయన్నారు. వచ్చే జనవరిలో నేషనల్ యూత్ కన్వెన్షన్‌కు ఏయూ ఆతిథ్యం ఇవ్వనుందని తెలిపారు. నాక్ ర్యాంకింగ్ సాధనలో విద్యార్థులు, ఉద్యోగులు, పరిశోధకులు అందరి భాగస్వామ్యం ఉందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా నాక్ సాధన కోసం తీవ్రంగా కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఐక్యూఏసీ సమన్వయకర్త ఆచార్య డి.లలిత భాస్కరి, ఓఎస్‌డీ వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీ–20 టికెట్ల విక్రయం

- మ్యాచ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- డీసీపీ–1 శ్రీనివాసరావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ-1 శ్రీనివాసరావు

అల్లిపురం: విశాఖ వేదికగా ఈ నెల 23న జరగనున్న ఇండియా, ఆస్ట్రేలియా టీ–20 మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీపీ–1 కె.శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం నుంచి టికెట్ల విక్రయాలు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఆన్‌లైన్‌లో టికెట్లు అందుబాటులో ఉంటాయని, ఉదయం 11 గంటల నుంచి పేటీఎం (ఇన్‌సైడర్.ఇన్)లో టికెట్లు పొందవచ్చన్నారు. 17, 18 తేదీల్లో పీఎంపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియం బీ గ్రౌండ్, వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం, గాజువాకలోని రాజీవ్ గాంధీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయించనున్నట్లు చెప్పారు. ఆఫ్‌లైన్‌లో ఒకరికి రెండు టికెట్లు మాత్రమే విక్రయిస్తారని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో 10,500, ఆఫ్‌లైన్‌లో 11,500 టికెట్లు విక్రయిస్తారని, కాంప్లిమెంటరీ టికెట్లు 5 వేల వరకు ఉంటాయన్నారు.

పోలీసులకు సహకరించాలి : క్రికెట్ మ్యాచ్ చూసేందుకు వచ్చే వారు పోలీసులకు సహకరించాలని డీసీపీ–1 కోరారు. మ్యాచ్ ప్రారంభానికి ముందుగానే వచ్చి ఎవరి సీట్లలో వారు కూర్చోవాలని సూచించారు. పోలీసులు సూచించిన ప్రాంతాల్లో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. విలువైన వస్తువులు, ఎక్కువ మొత్తంలో నగదు తీసుకురావద్దన్నారు. సెక్యూరిటీ పరంగా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటున్నామని.. టికెట్లపై ప్రత్యేకంగా మార్కు ఉంటుందన్నారు. స్కాన్‌లో ఆ మార్కు రాకపోయినా, కలర్ జిరాక్స్ టికెట్లు తీసుకొచ్చినా అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. వేరే వారి దగ్గర కొనుగోలు చేశామని కుంటిసాకులు చెప్పవద్దన్నారు. అలా వచ్చిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

2024లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు కోలా గురువులు

కొమ్మాది: అకుంటిత దీక్ష, అంకిత భావంతో 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అందరూ పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పిలుపునిచ్చారు. ఎండాడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి ఒక్కరూ ప్రజల్లోకి వెళ్లి పార్టీ చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఈ నెలలో ప్రారంభమయ్యే రెండో విడత సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, నాటి టీడీపీ పాలనకు, నేటి వైఎస్సార్‌సీపీ పాలనకు తేడా ఏమిటో వివరించాలన్నారు. అనంతరం కొత్తగా నియామకమైన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులను గురువులు సత్కరించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దామా సుబ్బారావు, పీలా ఉమారాణి, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు జి.రవిరెడ్డి, జోనల్ ఇన్‌చార్జి వంకాయల మారుతీప్రసాద్, కలిదండి బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన మరపడవ

8 మంది మత్స్యకారులు క్షేమం



ఎగువపేట తీరానికి కొట్టుకొచ్చిన మరపడవ

భీమునిపట్నం: భీమిలి తీరానికి సోమవారం రాత్రి ఒక మర పడవ (మెకనైజ్డ్ బోటు) కొట్టుకొచ్చింది. మండలంలోని చిన నాగమయ్యపాలెంకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులు బోటు నంబర్ 1155లో చేపల వేటకు విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి సోమవారం బయలుదేరారు. వీరి బోటు భీమిలి వైపు నుంచి వెళ్తున్న క్రమంలో ఇంజిన్ పాడైపోయి ఆగిపోయింది.

అదే సమయంలో గాలులు తీవ్రంగా వీస్తుండడంతో పడవ ఎగువపేట సమీపంలో తీరానికి కొట్టుకొచ్చి ఆగిపోయింది. అదృష్టవశాత్తు ఇందులోని మత్స్యకారులకు ప్రమాదం జరగలేదు. బోటు యజమాని గరికిన దానయ్య, మ్స్యకారులు బొడ్డు దుర్గయ్య, వాసుపల్లి నీలయ్య, వాసుపల్లి కుంచయ్య, వాసుపల్లి అప్పారావు, గరికిన ఎల్లాజీ, గరికిన నూకరాజు, వాసుపల్లి దానయ్య తీరానికి సురక్షితంగా చేరుకున్నారు. ఈ సంఘటనలో రూ.35 లక్షల విలువైన పడవ అడుగు భాగంతో పాటు మరికొన్ని చోట్ల పాడైపోవడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకుని నష్టపరిహారం అందివ్వాలని దానయ్య కోరుతున్నారు.

గరికిపాటి ప్రవచనాలతో యువత మేల్కొలుపు



గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం : గరికిపాటి నరసింహారావు ప్రవచనాలు నేటి యువతరానికి మేల్కొలుపులాంటివని ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గరికిపాటికి సాహిత్య కళాభారతి పురస్కారం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యువతీ, యువకులు గరికిపాటి ప్రవచనలో అంశాలను ఆకళింపు చేసుకుని ఆధ్యాత్మిక భావంతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. పురస్కార గ్రహీత గరికిపాటి మాట్లాడుతూ సాహిత్య కళాభారతి పురస్కారం ప్రదానం చేసి మా ఇంటికి శారదాంబను పంపారని కొనియాడారు. అనంతరం శ్రీనాథుడు రచించిన ఆకాశ దీపం– కాశీ ఖండంపై గరికిపాటి చెప్పిన ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ఆర్, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ కాశీ ఖండంపై మూడు రోజుల పాటు సాయంత్రం 5.30 గంటలకు ప్రవచనాలు ప్రారంభమవుతాయన్నారు.

యువతకు ఉపాధి శిక్షణ

డాబాగార్డెన్స్: ది అర్బన్ లెర్నింగ్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్(తులిప్) ఆధ్వర్యంలో డిగ్రీ, తత్సమాన అర్హత కలిగిన వారికి ఇంటర్న్‌షిప్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు యూసీడీ పీడీ పాపునాయుడు తెలిపారు. ఇంజినీరింగ్‌తో పాటు అర్బన్ ప్లానింగ్, అర్బన్ డిజైనింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మొబిలిటీ, ఫైనాన్స్, సోషల్ సెక్టార్, పర్యావరణ సమస్యలు వంటి ఎన్నో విభాగాల్లో శిక్షణ, ఉపాధి కల్పిస్తామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా కోర్సులు 8 వారాల నుంచి ఏడాది వరకు ఉంటాయని వెల్లడించారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు స్టైఫండ్ చెల్లిస్తుందన్నారు. బి.ప్లాన్, బీటెక్, బీఆర్క్, బీఏ, బీఎస్సీ, బీ.కాం, బీబీఏ, బీఈఏ, ఎల్ఎల్‌బీ తత్సమాన కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. https://internship.aicte-india.org/module_ulb/Dashboard/TulipMain ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు నగర సామాజిక అభివృద్ధి విభాగం(యూసీడీ), జీవీఎంసీ, జోనల్ కార్యాలయాల్లో సంప్రదించవచ్చు.

నేటి నుంచి గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

కొమ్మాది: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ మిషన్ భవన్‌లో బుధవారం నుంచి మూడవ జనజాతీయ గౌరవ దివస్–గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

డిజి లాకర్‌లో రిజిస్ట్రేషన్, లైసెన్స్ వివరాలు

గోపాలపట్నం: డిజిలాకర్‌లో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కార్డులు అందుబాటులో ఉంటాయని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లేస్టోర్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని మొబైల్ నంబర్/ఆధార్‌తో లాగిన్ అవ్వాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సెలక్ట్ చేసుకుని.. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, వెహికల్ రిజిస్ట్రేషన్ నంబర్, చాసిస్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ నంబర్ నమోదు చేయాలన్నారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, లైసెన్స్ వివరాలు నేరుగా వాహన్ సారథి నుంచి డౌన్‌లోడ్ అవుతాయని చెప్పారు. ఈ యాప్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న పత్రాలు ప్రామాణికమైనవని స్పష్టం చేశారు. పోలీస్, రవాణా శాఖ అధికారులు వాహనం తనిఖీ చేసినపుడు డిజిలాకర్‌లో ఉన్న ఈ పత్రాలు చూపించవచ్చని సూచించారు. జూలై 23 వరకు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ కార్డుల కోసం ఫీజు చెల్లించిన వారికి ఆయా తేదీల వారీగా కార్డు జారీ చేస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ వ్యాలిడిటీ ఉండి కార్డు లేకపోయినా బీమా పొందవచ్చన్నారు. పోలీసు, రవాణా శాఖ అధికారులు డిజిటల్ పత్రాలను అనుమతించకపోతే పోలీస్ కమిషనర్‌కు గానీ, ఉప రవాణా కమిషనర్‌కు గానీ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. విచారణ చేసి ఆ అధికారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఏఆర్‌సీకి చేరిన ఎలుగుబంటి



ఏఆర్‌సీలో ఎలుగుబంటి..

ఆరిలోవ : విజయనగరం జిల్లా గజపతినగరం మండలం పంటపొలాల్లో సంచరించిన మగ ఎలుగుబంటిని సోమవారం అర్ధరాత్రి విశాఖ జూ పార్కు సిబ్బంది జంతు పునరావాస కేంద్రానికి తీసుకొచ్చినట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. గజపతినగరం మండలంలో సంచరించిన విషయం అక్కడ అటవీశాఖ అధికారులు ద్వారా అదేరోజు సమాచారం తెలుసుకున్నామన్నారు. దీంతో జూ వైద్యుడు డాక్టర్ ఫణీంద్ర, సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ఎలుగుబంటిని చాకచక్యంగా పట్టుకొన్నారన్నారు. బోనులో బంధించి అక్కడ నుంచి ప్రత్యేక వ్యానులో ఏఆర్సీకి తీసుకొచ్చినట్లు తెలిపారు. దాని శరీరంపై స్వల్ప గాయాలుండటంతో ప్రస్తుతం ఏఆర్సీలో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

గైనకాలజిస్ట్‌లు నమోదు కావాలి

మహారాణిపేట: విశాఖ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్పత్రులు, క్లినిక్‌ల్లో, ప్రైవేట్ ప్రాక్టీస్(ఏఆర్‌టీ లెవల్–1) చేస్తున్న గైనకాలజిస్ట్‌లు తప్పనిసరిగా నేషనల్ రిజిస్టర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. నేషనల్ రిజిస్టర్ పోర్టల్‌లో దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని.. వాటిని పూర్తి చేసి 18లోగా డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందజేయాలన్నారు. రిజిస్టర్ చేసుకోని వారిపై ఏఆర్‌టీ రెగ్యులేషన్ యాక్ట్ 2021, రూల్స్ 2022 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి రాక నేడు

మహారాణిపేట: గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్.మానవేంద్రరాయ్ బుధవారం విశాఖ రానున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో రానున్న ఆయన నగరంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేస్తారు. ఈ నెల 16న ఉదయం 10 గంటలకు పార్వతీపురం వెళ్తారు.

బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో అభ్యంతరాలుంటే తెలపండి

డాబాగార్డెన్స్: సింహాచలం గోశాల జంక్షన్ నుంచి అడవివరం జంక్షన్ వరకు ప్రధాన రహదారికి అనుసంధానించే 100 అడుగుల వెడల్పు గల బీఆర్‌టీఎస్ రహదారి విస్తరణకు సంబంధించి సర్వే నంబరు వివరాలను జోనల్ కార్యాలయం, జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రదర్శించినట్లు కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణ నిర్వాసితులుగా 267 మందిని గుర్తించామని, వారి పేర్లు, ఫోన్ నంబర్లు తదితర వివరాల కూడిన జాబితా పొందుపరిచినట్టు తెలిపారు. వాటిపై అభ్యంతరాలు, సూచనలను సంబంధిత నిర్వాసితులు 15 రోజుల్లోగా తెలియజేయాలన్నారు. అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం నిబంధనల ప్రకారం టీడీఆర్ బాండ్లు జారీ చేస్తామన్నారు.

సత్తాచాటిన శ్రీరాములు, కె.వి.రావు

విశాఖ స్పోర్ట్స్: మాస్టర్స్ అథ్లెటిక్ మీట్‌లో శతాధిక వృద్ధుడైన శ్రీరాములు, మరో వెటరన్ కె.వి.రావు స్వర్ణాలందుకున్నారు. ఫిలిప్పీన్స్‌లో 22వ ఆసియన్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు జరిగింది. ఈ చాంపియన్‌షిప్‌లో వి.శ్రీరాములు 95–99 ఏళ్ల గ్రూప్‌లో ఫీల్డ్ అంశాలైన షాట్‌పుట్, డిస్కస్, జావెలిన్ త్రో అంశాల్లో పాల్గొని విజేతగా నిలిచి స్వర్ణాలందుకున్నారు. ఇదే మీట్‌లో 85–89 ఏళ్ల గ్రూప్‌లో కె.వి.రావు ఐదు వేల కిలోమీటర్ల నడక, షాట్‌పుట్ రెండింటా పాల్గొని విజేతగా నిలిచి స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిద్దరూ మంగళవారం విశాఖ చేరుకోగా.. ఎయిర్‌పోర్ట్‌లో విశాఖ జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ పోటీల్లో 22 దేశాలకు చెందిన పలువురు మాస్టర్ అథ్లెట్లు ఆయా వయసు కేటగిరీల్లో పోటీపడ్డారు.

టీడీపీ నాయకుల నుంచి ప్రాణహాని

రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు



మాట్లాడుతున్న గనిశెట్టి కనకరాజు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకుల నుంచి తనకు ప్రాణ హాని ఉందని రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత గనిశెట్టి కనకరాజు ఆరోపించారు. ఐదారేళ్లుగా తనను మట్టుబెట్టేందుకు టీడీపీ నేతలు ప్రయత్నిస్తున్నారన్నారు. టీడీపీ–జనసేన సానుభూతిపరుల చేతిలో దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కనకరాజు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చింతగట్లలో ఓ ప్రైవేటు భూ వివాదంలో ఇరువర్గాలకు సర్దిచెప్పేందుకు వెళ్లిన తనపై టీడీపీ–జనసేన కార్యకర్తలు చందక గోవిందరాజు, మాడిస హరీష్‌తో సహా పది మంది దాడి చేశారన్నారు. సర్వే నంబర్ 79/3 పూర్తిగా జిరాయితీ భూమి అన్నారు. కానీ తనపై దాడి చేసిన నిందితులను వెనకేసుకొస్తున్న టీడీపీ నేత బండారు సత్యనారాయణమూర్తి ఆ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా చేసిన బండారు కనీస పరిజ్ఞానం లేకుండా నిందితులను వెనకేసుకొస్తూ తప్పుడు ఆరోపణలు చేయడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. చింతగట్ల సర్వే నంబర్ 1లోని డి–ఫారం భూమిని టీడీపీ నాయకులు వారి ప్రభుత్వ హయాంలో కబ్జా చేస్తే తాము పోరాటం చేసి హక్కుదారులకు న్యాయం చేశామన్నారు. తమపై, ప్రభుత్వంపై బండారు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మహిళలను కించపరిచే వ్యక్తి నుంచి ఇంతకంటే ఏం ఆశిస్తాం : ఎంపీపీ నాగమణి

రాజకీయాల్లో ఉన్న మహిళలను కించపరిచి మాట్లాడిన బండారు సత్యనారాయణమూర్తి నిందితులకు కొమ్ము కాయడం కొత్త కాదని ఎంపీపీ మధుపాడ నాగమణి విమర్శించారు. చింతగట్ల, జెర్రిపోతుల పాలెం ప్రాంతంలో రాజకీయంగా కనకరాజును ఏమీ చేయలేక టీడీపీ నాయకులు ఇలా భౌతికదాడికి పాల్పడ్డారన్నారు. ఎంపీటీసీ సభ్యుడు నందవరపు అప్పలరాజు మాట్లాడుతూ కేవలం రాజకీయ కక్షతోనే ఓ ప్రైవేటు భూమి వివాదంలో మధ్యవర్తిగా సర్దిచెప్పిన కనకరాజుపై దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. తమ ప్రాంతంలో నేరసంస్కృతి పెరగడానికి టీడీపీ నాయకులే కారణమని ఆరోపించారు. చింతగట్ల సర్పంచ్ గనిశెట్టి వెంకటలక్ష్మి, గుర్రంపాలెం సర్పంచ్ ఉగ్గిన గోవింద, జెర్రిపోతులపాలెం మాజీ సర్పంచ్ కోన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా, శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడ మీద ఉన్న సంస్థ కార్యాలయంలో డిసెంబరు 1 నుంచి జనవరి 31 వరకు ప్రతి రోజూ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఆసక్తి గల గృహిణులు ఇన్‌స్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999లో సంప్రదించవచ్చు.

17న జాబ్‌మేళా

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 17న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ తెలిపారు. అపోలో ఫార్మసీలో 60 ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు ఏర్పాటు చేశామన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఎంబీఏ విద్యార్హతతో 18–30 ఏళ్ల వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు.

భార్య మృతి కేసులో భర్తకు పదేళ్ల జైలు

- మృతురాలి అత్తమామలకు ఏడేళ్ల జైలు
- అనకాపల్లి పదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ - 1 శ్రీనివాసరావు

అల్లిపురం: అదనపు కట్నం కోసం భార్యను వేధించి ఆమె మరణానికి కారణమైన ఘటనలో భర్తకు పదేళ్లు, అత్తమామలకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ అనకాపల్లి పదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.శ్రీవిద్య మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాంతిభద్రతల డీసీపీ – 1 కె.శ్రీనివాసరావు, పీపీ వడ్డాది వెంకటరావు వివరాలు వెల్లడించారు. 2017 జూన్ 19న బూరి నాగమణి పీఎం పాలెం, వాంబేకాలనీలోని ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యుడు పెరుగు అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పీఎం పాలెం పోలీసులు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సాక్షులను విచారించి చార్జిషీట్ కోర్టుల్ ఫైల్ చేయగా మృతురాలి భర్త బూరి నాగరాజు, అత్తమామలు బూరి నర్సమ్మ, బూరి నారాయణరావుపై నేరం రుజువయ్యింది. దీంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన విచారణ అధికారి ఏసీపీ (నార్త్ సబ్ డివిజన్) బీవీఎస్ నాగేశ్వరరావు, పీపీ వడ్డాది వెంకటరావును నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ తె.రవిశంకర్ అభినందించినట్లు తెలిపారు.

దువ్వాడ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం రద్దీ మార్గాల్లో వయా దువ్వాడ మీదుగా పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. తాంబరం –భువనేశ్వర్(06081) స్పెషల్ రైలు తాంబరంలో ఈనెల 21వ తేదీ మధ్యాహ్నం 1గంటకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 2.30గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 2.35గంటలకు బయల్దేరి అదేరోజు ఉదయం 9.55గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో భువనేశ్వర్–తాంబరం (06082)స్పెషల్ భువనేశ్వర్‌లో ఈనెల 15, 22వ తేదీల్లో మధ్యాహ్నం 12.50గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.45గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 8.50గంటలకు బయల్దేరి మరుసటిరోజు మధ్యాహ్నం 12గంటలకు తాంబరం చేరుకుంటుంది. తాంబరం–సంత్రగచ్చి (06079) స్పెషల్ రైలు తాంబరంలో ఈ నెల 15,22వ తేదీల్లో మధ్యాహ్నం 1గంటకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 2.30గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 2.35గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.45గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సంత్రగచ్చి–తాంబరం(06080)స్పెషల్ సంత్రగచ్చిలో ఈనెల 16, 23వ తేదీల్లో రాత్రి 11.40గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4.55గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 5గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.35గంటలకు తాంబరం చేరుకుంటుంది.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 16వ తేదీన, కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు ఈ నెల 17వ తేదీన ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు. భువనేశ్వర్–బెంగళూరు(18463) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు, బెంగళూరు–భువనేశ్వర్(18464) ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు 16 నుంచి 18వ తేదీ వరకు ఒక థర్డ్ ఏసీ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

దాబాగార్డెన్స్: మన పుస్తకాలే జాతీయ సంపదని, పుస్తక పఠనంతో జ్ఞాన సంపద పెరుగుతుందని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మంగళవారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మన గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, అయితే వాటిని వినియోగించుకోవడంలో విఫలమవుతున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ ప్రతి ఒక్కరికీ పుస్తక పఠనం తప్పనిసరన్నారు. సమాజంలో గొప్ప వ్యక్తులుగా ఎదగాలంటే జ్ఞాన సంపద అవసరమని, పుస్తక పఠనం ద్వారానే అది సాధ్యపడతుందన్నారు. కార్పొరేటర్ బిపిన్ కుమార్‌జైన్ మాట్లాడుతూ గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని, వాటిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. దాతల ద్వారా గ్రంథాలయాలకు కావాల్సిన కంప్యూటర్లను సమకూరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు, విశ్రాంత డిప్యూటీ గ్రంథాలయాధికారి కె.పోతురాజు, జిల్లా గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

నలుగురు చిన్నారులు, వృద్ధురాలిపై దాడి



వృద్ధురాలు, బాలుడి కాళ్లపై గాయాలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. మంగళవారం ఉదయం నుంచి నలుగురు చిన్నారులతో పాటు ఒక వృద్ధురాలిని, ఇంట్లో పెంచుకుంటున్న పెంపుడు కుక్కను కరిచి గాయపర్చింది. మంగళవారం ఉదయం స్కూల్‌కు వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకు వచ్చిన సాములపల్లి సందీప్ (10)ను పిచ్చి కుక్క రెండు చోట్ల కరిచి తీవ్రంగా గాయపర్చింది. దీంతో భీతిల్లిన బాలుడు గట్టిగా కేకలు వేయడంతో కుక్క అక్కడి నుంచి పారిపోయింది. తర్వాత అంగ పైడమ్మ (60) అనే వృద్ధురాలు ముఖం కడుక్కుంటుండగా అదే కుక్క వెనుకగా వచ్చి కాలిపై కరిచింది. భయంతో ఆమె గట్టిగా కేకలు వేయగా అక్కడి నుంచి పారిపోయింది. అదే కుక్క మరో వీధిలో చందనాల సాత్విక (5)ను, అదే వీధిలో నేలపాటి సత్యవతి అనే మహిళ ఇంట్లో ఉన్న పెంపుడు కుక్కను గాయపర్చింది. వీరితోపాటు మరో ఇద్దరు చిన్న పిల్లలపై కుక్క దాడి చేసిందని గ్రామస్తులు తెలిపారు.

నిరంతర సాధన వల్లే మెరుగైన విద్య

పెందుర్తి: నిరంతర సాధన వల్లే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించగలుగుతామని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. మంగళవారం వేపగుంట ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల అభ్యసన, అభివృద్ధి అవగాహనపై రెండు రోజుల శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం(ఎల్ఐపీ)లో ఉన్న ప్రతీ అంశాన్ని అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. 2024 జనవరి నాటికి 6,7,8 తరగతుల పిల్లలందరిలో ప్రాథమిక భాష, గణిత సామర్థ్యాల సాధనకు నిర్దేశించిన ఎల్ఐపీ అమలు చేయాలన్నారు. ఎల్ఐపీ రాష్ట్ర స్థాయి పరిశీలకుడు, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ ఇన్ పబ్లిక్ సిస్టం డైరెక్టర్ ఎస్.ఉపేంద్రరెడ్డి, డిప్యూటీ డీఈవో ఎ.గౌరీశంకర్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, భీమిలి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, అధ్యాపకుడు జి.రవి, సమగ్ర శిక్ష అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ అధికారి జి.లక్ష్మి, 11 ఎంఈవోలు పాల్గొన్నారు.